క్లుప్తంగా

అన్న సమారాధన

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామ పరిధిలో వెలసిన శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.సర్వేశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు, పరిసర ప్రాంత ప్రజల సహకారంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు అర్చకులు ఎస్.సంఘమేశ్వరరావు, పత్రి ప్రసాద్ తదితరులు తెలిపారు. వీరి నేతృత్వంలో గుమ్మిడి సింహాద్రి దంపతులు, స్థానిక భక్తులు స్వామి వారి కల్యాణం సాంప్రదాయంగా నిర్వహించారు.

భక్తుల కొంగు బంగారం కోటదుర్గమ్మ

పాలకొండ రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కీర్తిగాంచిన కోటదుర్గమ్మ దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఓ వైపు జోరున వర్షం, భారీగా గాలులు వీస్తున్నా లెక్కచేయక అమ్మ సన్నిధిని చేరేందుకు ఉత్సుకత చూపించారు. ఇటీవల వివాహాలు చేసుకున్న నూతన వధూవరులతో పాటు ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఘటాలు, మర్రాటలు సమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, మనీల్‌కుమార్ శర్మల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల తాడికితో దేవస్థానం ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

జాగ్రత్తలు పాటించాలి

- రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు రాకపోకలు సాగించేటప్పుడు ట్రాఫిక్ పరమైన జాగ్రత్తలు పాటించాలని పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మండలంలోని ఆర్‌కే బట్టివలస, వెకంపేట వై జంక్షన్ తదితర కూడళ్లలో ఆమె వాహన తనిఖీలను రూరల్ పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. అనంతరం వాహన చోదకులతో మాట్లాడుతూ విధిగా హెల్మెట్ ధరించాలని, అలాగే పరిమితికి మించి వాహనాలపై ప్రయాణం చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై అపరాధ రుసుం విధించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం బుధవారం నిర్వహించ నున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

13న మెగా జాబ్ మేళా

బొబ్బిలి: పట్టణంలోని విద్వాన్ డిగ్రీ కాలేజ్‌లో ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.మోహనరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ గ్రూప్స్‌లో వివిధ విభాగాల్లో నియామకాల కోసం కంపెనీ సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు.

సాగు వ్యయం..
వ్యవసాయం భారం!



దుక్కి పనులు చేస్తున్న రైతు(ఫైల్)

- రైతులను వేధిస్తోన్న సాగు భారం
- బాగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- అప్పులు చేసి మరీ పంటల సాగు
- ప్రభుత్వం నుంచి సాయం అందక అవస్థలు

గరుగుబిల్లి: ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, అననుకూల వాతావరణం, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం వంటివి వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న రైతన్నను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. ప్రస్తుతం వ్యవసాయానికి అయ్యే ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఏదీ అంత సులభంగా రావడం లేదు. దుక్కి పనుల దగ్గర నుంచి విత్తనాలు వేయడం, పంటకు నీరు కట్టడం, కూలీలను పెట్టి గాబు(పంటలో కలుపుమొక్కలు) తీయించడం, చేతికందిన పంటను కోయడం, కల్లాలకు తరలించడం, విక్రయించడం ఇలా అన్నీ ఖర్చుతో కూడుకున్నవే. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రకటించే సాగు సాయం రైతులకు ఉపయోగపడుతున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పనులు ఆరంభమవుతున్నా నేటికీ ఆ పథకం డబ్బులు ఊసే లేదు. దీంతో వేసిందేదో పనుల ప్రారంభమప్పుడు వేస్తే పెట్టుబడులకు ఉపయోగపడతాయి కదా అని అన్నదాతలు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయం ఎప్పుడొస్తాదో స్పష్టత లేని కారణంగా కొంతమంది అప్పులు చేసి మరీ పనులు ప్రారంభించారు. దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు.

గతేడాది కన్నా ఖర్చులు అధికం..

గతేడాది సాగుకు అయిన ఖర్చు కన్నా ఈ ఏడాది సాగుకు అయ్యే ఖర్చు అధికమైంది. ఇప్పుడు నైరుతి రుతుపవనాల ముందస్తు పలకరింపుతో వర్షాలు బాగా కురుస్తాయని..రైతులు విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. అయితే ఎక్కడకు వెళ్లి అడిగినా విత్తనాలు, ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నాయి. రైతులను దోచుకోవడమే పనిగా కొన్ని షాపుల యజమానులు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణ చేపట్టాల్సిన ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు.

నాడు భరోసా..నేడు నిర్లక్ష్యం..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు భరోసా ఉండేది. రైతు భరోసా పథకం కింద ఐదేళ్లూ చెప్పిన సమయానికి చెప్పిన నగదు రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. ఖరీఫ్, రబీ సీజన్ ముందుగానే డబ్బులు ఇవ్వడంతో రైతులు కూడా సాగు పనులు సవ్యంగా మొదలెట్టేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఏ దశలోనూ రైతులను చంద్రబాబు పట్టించుకోలేదు. వారు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా రైతన్నకు మేలు చేకూర్చే ఏ ఒక్క పని చేయలేదు. కనీసం వారు ఎన్నికల సమయంలో ఇస్తానన్న అన్నదాత సుఖీభవం పథకం డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో ప్రభుత్వంపై రైతులు పెదవివిరుస్తున్నారు.

పెట్టుబడి ఖర్చుల వివరాలిలా..

కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని వ్యవసాయ మదుపులు భారీగా ఉన్నాయి. పొలం దుక్కులకు ట్రాక్టరుకు రూ.2 వేలు, విత్తనాలకు రూ.వెయ్యి, దమ్ము, ఊడ్పులుకు రూ.6 వేలు, కలుపు తీయడానికి(రెండు సార్లు) రూ.5 వేలు, కోత, నూర్పులకు రూ.5 వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

సాగు వదిలేయడమే మేలనిపిస్తోంది..



ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభిస్తున్నాం. విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడం, ఏటా కూలి రేట్లు అధికమవ్వడంతో సాగు భారమైంది. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదు. ఇలా అయితే సాగు వదిలేయడమే మేలనిపిస్తోంది. రోజురోజుకూ వ్యవసాయం గుదిబండలా మారింది. -బంకురు సత్యనారాయణ,
గెడ్డతిరువాడ, జియ్యమ్మవలస

రైతులను ఆదుకోవాలి..



వ్యవసాయ భారంతో సతమతమవుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీకే రుణాలు ఇప్పించాలి. సంక్షేమ పథకాలు అందించాలి. ఆర్థికసాయం చేయాలి. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది.. ఆ సొమ్ము వేస్తే రైతులను ఎంతో కొంత ఆదుకున్నట్లవుతుంది. -కోలక అవినాష్,
గిరిజన సంఘం నాయకుడు, ఇరిడి గ్రామం,

పాఠశాలలపై పర్యవేక్షణ



ఉన్నత పాఠశాలకు సమకూరుస్తున్న సన్న బియ్యం బస్తాలు

పాలకొండ రూరల్: వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12 నుంచి పునఃప్రారంభం కానున్న పాఠశాలలను పూర్తి పర్యవేక్షణతో సిద్ధం చేస్తున్నట్టు ఉప విద్యాశాఖాధికారి పత్రి కృష్ణమూర్తి అన్నారు. ఎంఈవో కె.సోంబాబుతో కలసి పాలకొండ పట్టణ, మండల పరిధిలో గల 59 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో బడిబాట పట్టే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వనరులు, పరిసరాలు, తరగతి గదుల పరిశుభ్రత చేపట్టాలన్నారు. ఈ విద్యా ఏడాదికి సంబంధించి రికార్డులు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల సంఖ్య మేరకు అవసరమయ్యే సన్నబియ్యం బస్తాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ బస్తాలు పాఠశాలలకు అందించటం జరుగుతుందన్నారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో తగు చర్యలు చేపట్టాలన్నారు.

వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

కొమరాడ: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద అంతర్‌రాష్ట్ర రహదారిలో ఎస్‌ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, సారా రవాణాను అడ్డుకోవడంతో పాటు ఖైనీ, గుట్కా వంటి నిషేధిత మత్తు పదార్థాల తరలింపు, వినియోగం అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం:

మండలంలోని వనకాబడి గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో మంగళవారం జరిగిన సీపీఎం నేత కిల్లక శంకర రావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఆ కార్యక్రమ అనంతరం గ్రామ రోడ్డు పరిశీలించి కాసేపు మాట్లాడారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు.



పలు ప్రాంతాల్లో వర్షం

భామిని: నేరడి-బీలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: రుతుపవనాల అనుకూలతతో పాలకొండ పట్టణం, మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం వేకువజాము నుంచి భారీ గాలులతో కూడిన వర్షంతో జనజీవనం స్తంభించింది. రెండు రోజుల కిందట వరకు వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఈ వర్షాలతో ఉపశమనం పొందారు. మరోవైపు వరుణుడి కరుణతో రైతులు దుక్కులకు సిద్ధపడ్డారు. వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

భామిని: మండలంలో పలు చోట్ల మంగళవారం వేకువజాము నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రోజంతా ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. ప్రజలు ఉక్కపోతతో ఉపశమనం పొందారు.



పాలకొండ రూరల్: పట్టణ పరిసరాల్లో గాలులతో కూడిన వర్షం

ఈదురుగాలులతో కూడిన వర్షం

గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస రూరల్: మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం మంగళవారం కురిసింది. ఉదయం, మధ్యాహ్న సమయాల్లో ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల అరటితోటలు నేలమట్టమయ్యాయి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ యోగా తప్పనిసరిగా సాధన చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. కురుపాం మండల కేంద్రంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమ ర్యాలీలో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. అందరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, ఉదయం, సాయంత్రం యోగా చేస్తే ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు.

కార్యక్రమంలో కురుపాం మండలం స్పెషల్ ఆఫీసర్ తేజశ్వరరావు, తహసీల్దారు రవణమ్మ, ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన

రేగిడి: విత్తన గుళికల తయారీపై సోమరాజుపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్-2 గౌరీశ్వరరావు, సురేష్ మంగళవారం అవగాహన కల్పించారు. కందులు, మినుములు,పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న తదితర రకాల విత్తనాలను మట్టిలో కలిపి గుళికలుగా తయారు చేసుకోవాలన్నారు. ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని చెప్పారు. విత్తనగుళికలను పొలాల్లో వెదజల్లితే వర్షాలకు మొలకెత్తుతాయని వివరించారు.వీపీఏ అసిరినాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.రమాదేవి, జి.సింహాచలం, కె.పార్వతి, పి.గౌరీశ్వరరావు,పైల తవిటినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు బియ్యం తరలించాలి



స్టాక్ పాయింట్‌లో సరుకులు పరిశీలిస్తున్న జీసీసీ డీఎం రామారావు

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలలకు పంపాల్సిన బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు తరలించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ జె.రామారావు సూచించారు. మండలంలోని జీసీఎంఎస్ పరిధిలో ఉన్న గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రాంతాల్లోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. రికార్డుల ఆధారంగా స్టాక్ నిల్వలు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున పాఠశాలలు, వసతిగృహాలకు పంపించాల్సిన బియ్యం, ఇతర సరుకులను పంపించాలని తెలిపారు. అలాగే సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ గొదాం, పెట్రోల్ బంకులను తనిఖీ చేసి, మెరుగైన వైద్యసేవలందివ్వాలన్నారు. ఆయన వెంట పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ జి.సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



వలసబల్లేరులో అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కురుపాం మండలంలోని వలసబల్లేరు, లంకాజోడు, పెదగొత్తిలి గ్రామాల్లో పంటల సాగుపై రైతులకు కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్తలు మంగళవారం అవగాహన కల్పించారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎస్.ధ్రువ, శాస్త్రవేత్తలు అనంత విహారి, బిందు తదితరులు ఏ కాలంలో ఏ రకమైన నేలలో ఏ పంట వేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయన్న విషయాలను తెలియజేశారు. అనంతరం వరి, మొక్కజొన్న తదితర పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, నవధాన్యాల సాగు, ప్రకృతి సేద్యం, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే డ్రోన్ సాయంతో ఎరువుల పిచికారీ వంటి వాటిని తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.శ్రీనివాసరాజు, వి.వెంకటేశ్వరులు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

గరుగుబిల్లి: కిశోర బాలికలంతా సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి సూచించారు. మండల కేంద్రంలో కిశోర బాలికా విద్య, వికాసంపై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి బాలికల్లో రుతుస్రావం ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ సమయంలో అధిక శాతం రక్తం కోల్పోయి శక్తి నశించే అవకాశం ఉన్నందున మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. రావుపల్లిలో జరిగిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలోనూ ఈమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. మూడేళ్ల వయసు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అంగన్‌వాడీల్లోనే ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యనందివ్వడం జరుగుతోందని తెలిపారు.

● ఇదేమి తీరు...!



లివిరి వద్ద కోతకు గురైన పచ్చని చెట్టు

భామిని: ఓ వైపు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. మొక్కలతోనే పర్యావరణ సాధ్యమని చెబుతూ ఫొటోలకు ఫోజులిచ్చే పాలకులు, అధికారులు.. మరోవైపు పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్న పట్టించుకోవడం లేదు. రహదారి పక్కన ఉండే చెట్లను పలుచోట్ల ఎవరు నరికేస్తున్నారో.. ఎందుకు నరికేస్తున్నారో.. తెలియడం లేదు. భామిని మండల కేంద్రం నుంచి బాలేరు వరకు ఏబీ రోడ్డు పక్కనే ఉన్న పచ్చని చెట్లను నేలమట్టం చేశారు. కొత్తగా విద్యుత్ లైన్లు వేసేందుకు ఇలా నరికేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.



దిమ్మిడిజోల - బాలేరు మధ్య నేలకు ఒరిగిన చెట్టు

- ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై విత్తనాలు
- ఖరీఫ్ సేద్యానికి ముందే భూసారం పెంపునకు చర్యలు

పచ్చిరొట్ట సేద్యంతో...
సాగు భూమికి సత్తువ

పాలకొండ రూరల్:

ఖరీఫ్ సేద్యంలో మరింత దిగుబడిని పెంచుకునేందుకు భూసారం పెంపుపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రుతుపవనాల అనుకూలతతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో సేద్యానికి మునుపు భూమిలో సారం పెంచేందుకు పచ్చిరొట్ట సేద్యం చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. వీటి సాగుతో భూమిలో సారం, సత్తువ రెట్టింపు కాబడి ఆ ప్రభావంతో మంచి దిగుబడి వస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విధానంతో రసాయన ఎరువుల వాడకం తగ్గి ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చనంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా జిల్లాలో 1,600 క్వింటాళ్ల మేర పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై పంపిణీ చేపట్టారు. రైతుల ఆసక్తి, రిజిస్ట్రేషన్ల మేరకు మరెన్ని క్వింటాళ్లు అందించేందుకు సిద్ధమని అధికారులు చెబుతున్నారు.

మెట్ట భూముల్లో..

మెట్ట భూముల్లో తగ్గిపోతున్న స్థూల, సూక్ష్మ పోషకాలను పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగకరం. గతంలో పాడి సంపద నుంచి సేకరించిన పశువుల ఎరువుల వాడకం వలన సాగుభూమికి సత్తువ చేకూరేది. ముఖ్యంగా సేంద్రియ విధానంతో భూసారం పెంచటం వలన బహుళ ప్రయోజనాలు సమకూరేవి. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం గణనీయంగా పెరగటంతో భూమి నుంచి పైరుకు అవసరమైన పోషకాలు లభించటం లేదు. రైతు రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట సాగు చేయటం లాభదాయకమని రైతులు గుర్తించాలి.



ఈ తరహా పచ్చిరొట్ట సాగుతో సాగుభూమికి సమకూరనున్న పోషకాలు

రైతుల ఆసక్తి మేరకు..

రైతు సేవా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు యంత్రాంగం నిర్ణయించింది. మండలాల వారీగా వ్యవసాయాధికారులు సూచించిన మేర ఈ విత్తనాల సరఫరా జరుగుతుంది. ముందుగానే అధికారులు ఆన్‌లైన్‌లో ఈ వివరాలు పొందుపర్చటం వలన అవసరం మేరకు సంబంధిత రైతులకు అందిస్తున్నారు. అర్హత గల రైతులు తమ ఆధార్ కార్డుతో కేంద్రాలకు చేరుకుని బయోమెట్రిక్ వేసి వివరాలు అందించాల్సి ఉంటుంది. విత్తనాలు కేంద్రాల నుంచి తీసుకునే సమయంలో ఎస్టీ రైతులు 90 శాతం, ఇతరులు 50 శాతం రాయితీ మినహాయించుకుని మిగిలిన మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. పిల్లి పెసర, కట్టె జనుము, జీలుగ కలిపి ఉన్న (పీఎండీఎస్) ఈ విత్తనాలు 10 కేజీల బ్యాగ్‌ల రూపంలో సిద్ధం చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

నాణ్యమైన దిగుబడులు



రైతులు ఏటా వెదలు వేయటం వలన భూసారం తగ్గుతుంది. రెండేళ్లకు ఓసారి పచ్చిరొట్ట సేద్యం చేయటం వలన సత్ఫలితాలు వస్తాయి. వెదలు క్రమంలో రానున్న నెలలో ఆశించిన మేర వర్షాలు కురవకపోతే దిగుబడి, నాణ్యత తగ్గిపోతుంది. ముందస్తు పచ్చిరొట్ట సేద్యం వలన పంట భూమికి అవసరమయ్యే కీలక పోషకాలు సమకూరుతాయి. దీనివలన పంట దిగుబడి, గింజ నాణ్యత సక్రమంగా ఉంటుంది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నాం. - కె.రత్నకుమారి,
వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం పంచకుండముల గాయత్రి హోమం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నెల్లి సింహాచలం పాల్గొన్నారు.